సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 14 । జూలై । 2023



ఎక్కడి చెత్త అక్కడే !

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో కార్మికుల సమ్మెతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. మురికి కాలువల్లో నీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. IIIలో▸



ఆర్‌వోబీ పనుల పరిశీలన

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు వద్ద రూ.35 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ గురువారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి

నస్పూర్: రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈ నెల 15న తలపెట్టిన రూ.లక్ష ఆర్థిక సహాయం పథకం చెక్కుల పంపిణీ ప్రారంభంపై కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలో 300మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కు పంపిణీకి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా వెనుకబడి తరగతులు, అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడలను పర్యవేక్షిస్తున్న ఉపేందర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రంగంపేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో రెండవ రోజు గురువారం రాష్ట్రస్థాయి జూనియర్స్ అండర్–19 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. బాలుర సింగిల్స్, డబుల్స్, బాలికల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో భాగంగా 60 మ్యాచ్‌లను నిర్వహించారు. ఇందులో 20 క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరగ్గా, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రావు పోటీలను పర్యవేక్షించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ ఎడ్ల మహేశ్, అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర



దిష్టిబొమ్మతో రాస్తారోకో చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బెల్లంపల్లిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం శవయాత్ర చేశారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో కన్నాల చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కన్నాల రైతువేదిక వరకు డప్పుచప్పుళ్లతో చేరుకుని రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఏఎంసీ చైర్మన్ నిరంజన్, ఏఎంసీ మాజీ చైర్మన్ సిలివేరి నర్సింగం, ఎంపీపీ శ్రీనివాస్, కౌన్సెలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మిల్లులపై మరింత నజర్!



నెన్నెల: నందులపల్లిలోని రైస్‌మిల్లులో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో వేణు, డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్, తహసీల్దార్లు

- ఇక తహసీల్దార్లకు 'సీఎంఆర్' పర్యవేక్షణ
- రోజువారీగా నివేదికలు, తనిఖీల బాధ్యతలు
- సీఎంఆర్ ప్రక్రియపై అవగాహన
- మిల్లుల లక్ష్యం చేరేందుకు దోహదం

జిల్లాలో సీఎంఆర్ వివరాలు(విలువ మెట్రిక్ టన్నుల్లో)..

సంవత్సరం	సీజన్	మిల్లులకు కేటాయించిన ధాన్యం	ఇచ్చిన బియ్యం
2021-22	యాసంగి	60,536	36,223
2022-23	వానాకాలం	1,19,177	10,788
2022-23	యాసంగి	74,902	2,320

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యేక దృష్టి సారించారు. పర్యవేక్షణ బాధ్యతలు తహసీల్దార్లకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పౌర సరఫరాల శాఖ మాత్రమే మిల్లులను పర్యవేక్షిస్తోంది. ఇకపై జిల్లాలోని మిల్లుల్లో ధాన్యం తనిఖీల నుంచి రోజువారీ నివేదికలు సైతం తహసీల్దార్లు ఇవ్వనున్నారు. అంతేకాక ఏదైనా మిల్లుల్లో అవకతవకల ఫిర్యాదులు వస్తే వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. రోజువారీగా సీఎంఆర్ లక్ష్యాలను చేరుకునేలా రెండ్రోజులకోసారి మిల్లులకు వెళ్లాల్సి ఉంటుంది. తహసీల్దార్లు తమ మండల పరిధిలో ఉన్న మిల్లుల పర్యవేక్షణలో ఉంటే మిల్లర్లు బియ్యం సకాలంలో ఇవ్వడంలో అలసత్వం వహించరని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ బాధ్యతల నిర్వహణపై మిల్లుల్లో తనిఖీలు చేసేందుకు మొదట పది మంది తహసీల్దార్లు గురువారం తాండూరు మండలం రేచ్నీ వెళ్లారు. అక్కడ మిల్లులో మిల్లింగ్ జరగకపోవడంతో నెన్నెల మండలం నందులపల్లిలో ఓ రైస్‌మిల్లుకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీసీ ఎస్‌వో ప్రేమ్‌కుమార్, ఆర్డీవోలు శ్యామలాదేవి, వేణుతోపాటు జిల్లాలోని ఆయా మండలాల నుంచి తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ అవగాహన ప్రధానంగా మిల్లుల్లో తనిఖీలు చేసేటప్పుడు ధాన్యం బస్తాల లెక్కింపులు, రికార్డుల్లో ఉన్న ధాన్యం నిల్వలు, వాస్తవంగా ఉన్న బస్తాలు, మిల్లింగ్ చేయడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ధాన్యం నిల్వలపైనే గందరగోళం

ప్రతీ సీజన్‌లో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్‌మిల్లులకు పంపడమే తప్ప లక్ష్యం మేర బియ్యం తిరిగి ఇవ్వడం లేదు. కొన్ని మిల్లులు మాత్రమే సకాలంలో సీఎంఆర్ ఇస్తున్నాయి. దీనిపై కలెక్టర్, అదనపు కలెక్టర్ రైస్‌మిల్లర్లతో సమీక్షలు, సమావేశాలు ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఆదేశాలు ఇస్తున్నా ఆశించిన లక్ష్యం చేరడం లేదు. చివరకు 2021–22 యాసంగి ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ ఇవ్వకుండా అలసత్వం చేసిన 19 మిల్లులకు రూ.51కోట్ల జరిమానా విధించారు. జిల్లాలో ఏటేటా ధాన్యం దిగుబడి పెరుగుతోంది. ప్రతీ సీజన్‌లో కొత్త మిల్లులు చేరుతున్నాయి. గత వానాకాలం సీజన్ నాటికి జిల్లాలో మొత్తం 54మిల్లులకు చేరాయి. ఇంకా కొంత ధాన్యం పక్క జిల్లాలకు పంపాల్సి వస్తోంది. వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు సమయాల్లో సీఎంఆర్ ఇవ్వకున్నా రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు చివరకు మళ్లీ ఆ మిల్లర్లకే పంపాల్సి వస్తోంది. దీనిని ఆసరా చేసుకుని కటింగ్ పేరుతో ధాన్యం అధికంగా తీసుకోవడం, ట్రక్‌షీట్‌లో అవకతవకలు, ఎఫ్‌సీఐకి బియ్యం పంపడంలో అలసత్వం వహిస్తున్నారు. నూకలు వస్తున్నాయని, యంత్రాల నిర్వహణ, కూలీల కొరత, విద్యుత్ కోతలు, తదితర కారణాలతో సీఎంఆర్ జాప్యం చేస్తున్నారు. ఇక కొన్ని మిల్లుల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యం మిల్లుల్లో ఉందో లేక పక్కదారి పట్టిందో అనే అనుమానాలు ఉన్నాయి. ఇక కొందరైతే పీడీఎస్ బియ్యాన్నే తిరిగి పౌరసరఫరాల శాఖకు ఇస్తూ స్టేజ్ వన్ గోదాంల వద్ద బియ్యం 'పాస్' చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంతో అటు ఉన్నతాధికారులపై ఒత్తిడి తగ్గడంతోపాటు క్షేత్రస్థాయిలో జరిగే వాస్తవ పరిస్థితి ఎప్పటికప్పుడు తెలిసేందుకు వీలు పడనుంది.

నేర రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దాలి

- విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



మంచిర్యాల సీఐకి రివార్డ్ అందజేస్తున్న సీపీ

మంచిర్యాలక్రైం: పోలీసు అధికారులు సమష్టిగా కృషి చేసి నేరరహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. కమిషనరేట్ హెడ్‌క్వార్టర్‌లో గురువారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులతో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. 2018 నుంచి 2023 జూన్ వరకు నమోదైన కేసుల్లో పెడింగ్, విచారణలో ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించిన, క్రమశిక్షణ రహితంగా వ్యవహరించినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఈఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 689 ఫిర్యాదులు స్వీకరించగా 101 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. దశాబ్ది ఉత్సవాలు, సీఎం పర్యటనలో పటిష్ట బందోబస్తుకు కృషి చేసిన మంచిర్యాల డీసీపీ, ఏసీ పీలతోపాటు పోలీస్ అధికారులకు రివార్డులు అందజేశారు. డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, వైభవ్ గైక్వాడ్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

17న ఉపాధ్యాయుల నిరసన దీక్ష

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 17న మంచిర్యాలలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ గురుకుల రాష్ట్ర కన్వీనర్ ఎల్లయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు తెలిపారు. గురువారం మంచిర్యాలలో మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, పనిభారం, మానసిక ఒత్తిడి తగ్గించాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లా కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు బారికిరావు పాల్గొన్నారు.

ఆర్వో, ఏఆర్వోల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్(ఆర్వో, ఏఆర్వో) ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్ రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా స్థానాల్లో పని చేసే అధికారులే ఎన్నికల విధుల్లో బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. రిటర్నింగ్ ఆఫీసర్లుగా ఐఏఎస్, ఆర్డీవోలు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆయా మండలాల్లో తహసీల్దార్లు వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ ఆఫీసరు	అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు(తహసీల్దార్లు)
సిర్పూర్	అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)	సిర్పూర్(టీ), కాగజ్‌నగర్, బెజ్జూరు, పెంచికల్‌పేట, కౌటాల, చింతలమానేపల్లి, దహెగాం
చెన్నూరు(ఎస్సీ)	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూ సేకరణ, ఆర్‌అండ్ఆర్ మంచిర్యాల	మందమర్రి, జైపూర్, చెన్నూరు, కోటపల్లి, భీమారం
బెల్లంపల్లి(ఎస్సీ)	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మంచిర్యాల	కాసిపేట, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూరు, వేమనపల్లి, నెన్నెల
మంచిర్యాల	ఆర్డీవో, మంచిర్యాల	దండేపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్
ఆసిఫాబాద్(ఎస్టీ)	అదనపు కలెక్టర్(రెవెన్యూ), కుమురంభీం జిల్లా	నార్నూరు, గాదిగూడ, జైనూరు, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి, ఆసిఫాబాద్, వాంకిడి
ఖానాపూర్(ఎస్టీ)	ఆర్డీవో, ఉట్నూరు	ఇంద్రవెల్లి, ఉట్నూరు, కడెం, దస్తూరాబాద్, ఖానాపూర్, పెంబి, జన్నారం, సిరికొండ
ఆదిలాబాద్	ఆర్డీవో, ఆదిలాబాద్	ఆదిలాబాద్(అర్బన్), ఆదిలాబాద్(రూరల్) జైనథ్, బేలా, మావల
బోథ్(ఎస్టీ)	పీవో, ఐటీడీఏ, ఉట్నూరు	బోథ్, బజార్‌హత్నూరు, నేరడిగొండ, ఇచ్చోడ, తలమడుగు, తాంసి, భీంపూర్
నిర్మల్	ఆర్డీవో, నిర్మల్	సారంగాపూర్, మామడ, లక్ష్మణచాంద, సోన్, నిర్మల్(రూరల్), నిర్మల్(అర్బన్), దిలావార్‌పూర్, నర్సాపూర్–జి
ముథోల్	ఆర్డీవో, బైంసా	కుబీర్, కుంటాల, బైంసా, లోకేశ్వరం, ముథోల్, బాసర, తానూరు

రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సుమన్, వేదికపై మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, నాయకులు

- రైతులను కాపాడుకునే కేసీఆర్
- ఎవరు కావాలో ఆలోచించుకోవాలి
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- చెన్నూర్‌లో భారీ ర్యాలీ.. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్: రైతులను కాపాడుకునే ముఖ్యమంత్రి కేసీఆర్ రైతురాజ్యం కావాలా, రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకునే కాంగ్రెస్ పార్టీ కావాలో రైతన్నలు ఆలోచించుకోవాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ధరణి వద్దు, ఉచిత కరెంటు రద్దు అంటూ ఉచిత కరెంటుకు ఉరి వేస్తున్న కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గాంధీచౌక్ నుంచి తెలంగాణ తల్లిచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లలో రైతు సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతు రాజు కావాలనే ఉద్దేశంతో రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత దేశంలోనే కేసీఆర్‌కు దక్కిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని నిరసన తెలిపిన రైతులను పిట్టల్లా కాల్చిచంపిన చరిత్ర ఉందన్నారు. దేశంలోనే రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణయేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, ధరణి వంటి సంక్షేమ పథకాలను రద్దు చేసే కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఉచిత విద్యుత్ వద్దన్న కాంగ్రెస్‌ను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అజ్గర్ అలీ, బీఆర్‌ఎస్ నాయకులు శశిపాల్‌రెడ్డి, ఎరినాగుల ఓదెలు, చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్.. వద్దు..!

- శాశ్వతం చేయాలి.. ఉద్యోగ భద్రత కల్పించాలి
- నిరవధిక సమ్మెలో మల్టీపర్పస్ కార్మికులు
- జిల్లాలో కొనసాగుతున్న నిరసనలు
- పల్లెల్లో పారిశుధ్య పనులపై ప్రభావం



కోటపల్లి: సమ్మెలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి: మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేసి ఉద్యోగాలను పర్మినెంటు చేయడంతోపాటు కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలనే తదితర డిమాండ్లతో గ్రామ పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. 2011 జనాభాకు అనుగుణంగా పంచాయతీల్లో మల్టీపర్పస్ కార్మికులు పని చేస్తుండగా అన్ని రకాల విధులతో పనిభారం పడుతోంది. కార్మికులు పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, పారిశుధ్య పనులు చేస్తున్నారు. పల్లెల్లో వీధులు, రహదారులు శుభ్రపర్చడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేస్తుంటారు. ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తుంటారు. నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే వీరి రక్షణకు అవసరమైన సామగ్రి పంపిణీలో జాప్యం జరుగుతోంది.

జిల్లాలో 1100 మంది

జిల్లాలోని 310 గ్రామ పంచాయతీల్లో 1100 మంది మల్టీపర్పస్ కార్మికులు పని చేస్తున్నారు. వీరికి ఏప్రిల్ వరకు రూ.8,500 వేతనం చెల్లించగా రెండు నెలల క్రితం సీఎం కేసీఆర్ కార్మికుల వేతనాన్ని అదనంగా రూ.1,000 పెంచడంతో ప్రస్తుతం మే నెల నుంచి రూ.9,500 అందుకుంటున్నారు. కొన్ని పంచాయతీల్లో ఆదాయాన్ని బట్టి నెలకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు చెల్లిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో ఐదుగురు వరకు పని చేస్తుండగా.. మేజర్ పంచాయతీల్లో దాదాపు 20 మంది వరకు ఉన్నారు. గతంలో వీరికి ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘాల నుంచి వేతనాలు చెల్లించేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ట్రెజరీల్లో బిల్లులు నిలిచిపోతున్నాయి. దీంతో నెలలుగా వేతనాలు పెండింగ్ పడుతూ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఈ నెల 6నుంచి విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు.

వీధుల్లో దుర్గంధం

2011 జనాభా ప్రాతిపాదికన కార్మికుల నియామకం చేపట్టారు. వేతనాలు సమయానికి రాకపోవడం, శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల కడుపునింపని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని చేపట్టిన నిరవధిక సమ్మెతో పంచాయతీల్లో సమస్యలు మొదలయ్యాయి. పారిశుధ్య పనులు, చెత్త తరలింపు, ట్రాక్టర్, వీధి దీపాల నిర్వహణ తదితర పనులు నిలిచిపోయాయి. దీంతో వీధులు, రహదారుల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.

ఇవీ డిమాండ్లు

- పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి ట్రెజరీల ద్వారా వేతనాలు ఇవ్వాలి.
- పీఆర్సీ మేరకు ప్రాథమికంగా రూ.19,000 వేతనం చెల్లించాలి.
- జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 వేతనాలు ఇవ్వాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి.
- మల్టీ పర్పస్ కార్మిక విధానం రద్దు చేయాలి.
- విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి. సహజ మరణానికి రూ.5 లక్షల బీమా అందజేయాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యూటీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- కార్మికులపై వేధింపులు, అక్రమ తొలగింపులు నిలిపివేయాలి. ఈ డిమాండ్లపై జేఏసీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలని కోరుతున్నారు.

వేతనాలు పెంచాలి



మల్టీపర్పస్ కార్మిక విధానంతో పంచాయతీల్లో మేము వివిధ రకాల పనులు చేస్తున్నాం. మల్టీపర్పస్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తూ పర్మినెంట్ చేయాలి. మా డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదు. గ్రామాల్లో ప్రధాన పాత్ర పోషించే మాపై ప్రభుత్వం దయతో వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి. **– ఎం.వెంకటచారి, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు, హాజీపూర్**

డిమాండ్లు పరిష్కరించాలి



పొద్దున్నే పల్లెలో చెత్తా తీసి ఊరును బాగు చేసే మమ్మల్ని కనీసం గుర్తించి కాస్త కనికరంతోనైనా ఆదుకునేలా చూడాలి. మల్టీపర్పస్ విధానంతో పని భారం పెరిగింది. వచ్చే జీతాలు చాలకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వచ్చే వేతనాలు నెలల తరబడి రావడం లేదు. మా పరిస్థితి ఎవరికి చెప్పాలో తెలియడం లేదు. ప్రభుత్వం గుర్తించి పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. **– చాతరాజు మురళి, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు**

వేతనం సరిపోవడం లేదు...

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.8500 వేతనం సరిపోవడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన చెల్లింపుల్లో మార్పులు చేయాలి. రూ.19వేలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి. ఆదివారం సెలవుతోపాటు ఉన్నతాధికారుల వేధింపులు మానుకోవాలి. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు మా న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలి. **– మహేశ్, కార్మికుడు, గ్రామం: పుల్లగామ, మం: కోటపల్లి**

క్రమబద్ధీకరణకు అర్హులను గుర్తించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ప్రభుత్వ ఆక్రమిత, సింగరేణి ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు జీవో 58, 59, సింగరేణి 76 ద్వారా చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులు బకాయి రుసుములు చెల్లించేలా అవగాహన కల్పించి వసూలు చేయాలని, రుసుము చెల్లించేందుకు నిరాకరిస్తే కట్టడాల కూల్చివేతకు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. తహసీల్దార్లు మిల్లులను తనిఖీ చేయాలని ఆదేశించారు.

ఎట్టకేలకు ముందడుగు

ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్ల నిర్మాణాల క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు ముందడుగు పడింది. జీవో 58, 59 దరఖాస్తు గడువు ముగియడంతో పరిశీలనకు జిల్లాలో పది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నలుగురుతో కూడిన పది బృందాలకుగాను ఒక్కో బృందానికి జిల్లా స్థాయి అధికారితోపాటు డిప్యూటీ తహసీల్దార్, గిర్దావరి, సర్వేయర్లను పరిశీలకులుగా నియమించారు. మంచిర్యాల, మందమర్రి మండలాలకు జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి జి.సత్యం, నస్పూర్ మండలానికి జిల్లా సర్వేయర్ అధికారి ఎం.శ్రీనివాస్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎస్.రాజేశ్వరి, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, చెన్నూర్ మండలాలకు మంచిర్యాల ఆర్డీవో వేణు, భీమిని, కాసిపేట, తాండూర్ మండలాలకు జిల్లా ఆడిట్ అధికారి డి.శ్రీనివాస్, కన్నెపెల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాలకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి శాఖ అధికారి పి.రవీందర్‌రెడ్డి, జైపూర్, భీమారం, కోటపల్లి మండలాలకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వై.రమేష్, బెల్లంపల్లికి బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, జిల్లా కార్మిక శాఖ అధికారి వనిత, జిల్లా ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారి దుర్గప్రసాద్ ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. ఈ బృందాలకు శిక్షణ అనంతరం ఈ నెల 20 నుంచి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన చేయనున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని మొబైల్ యాప్‌లో వివరాలు పొందుపరుస్తారు.

క్లుప్తంగా

కుక్కల స్వైర్య విహారం


గాయపడిన వృద్ధురాలు


గాయపడిన బాలుడు

జన్నారం: ఊరకుక్కల స్వైర విహారం చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచాయి. జన్నారం మండలం రాంపూర్ గ్రామంలో గురువారం గ్రామంలో తిరుగుతున్న పిచ్చికుక్కలు ఇంటి ఎదుట మంచంలో పడుకున్న నాగుల లచ్చవ్వపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. అదే విధంగా ఆడుకుంటున్న ఎల్మల అశ్విన్‌ను ముఖంపై గాయపరిచాయి. అలాగే అదే గ్రామానికి చెందిన గొర్రె ఎల్లవ్వ, తుల్‌సింగ్, బుక్య ముళీల్‌బాయి, ఓరుగంటి శశికళలపై దాడి చేశాయి. వెంటనే గాయపడిన వారిని కుటుంబీకులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో ఊరకుక్కలు, పిచ్చి కుక్కలతో భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని కుక్కల బెడద తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోగిని హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

మంచిర్యాలక్రైం: ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 10న అర్ధరాత్రి ఓ రోగిపై కత్తితో దాడి చేసి హత్య చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన చిలుక దేవయ్య(49) అనారోగ్యంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. అప్పటికే అదే ఆసుపత్రిలో దేవయ్య బెడ్ పక్కనే రాంనగర్‌లో నివాసం ఉంటున్న మహారాష్ట్రకు చెందిన గాదే సుధాకర్ అనారోగ్యంతో చేరాడు. సుధాకర్ దగ్గు రావడంతో దేవయ్య చేయి అడ్డుపెట్టుకోవాలని సూచించాడు. కోపంతో సుధాకర్ బెడ పక్కనే ఉన్న పండ్లు కట్ చేసే కత్తితో దేవయ్యపై దాడి చేశాడు. గాయపడిన దేవయ్యను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని సుధాకర్‌ను గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిట్లు సీఐ తెలిపారు.

కాలుష్యంతో రోగాల బారిన పడుతున్న ప్రజలు


డంప్‌యార్డును పరిశీలిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త డంప్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో, పొగతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్ అన్నారు. గురువారం డంప్‌యార్డును పరిశీలించి కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో ఇండ్ల సమీపంలో చెత్త డంప్ యార్డు ఏర్పాటుతో యార్డులోని వ్యర్థాల నుంచి దుర్వాసన వస్తుందని, వర్షాలు కురిస్తే నీరు నిలిచి దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు ఎలాంటి హాని జరుగక ముందే డంప్‌యార్డును ఇక్కడి నుంచి మరోచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, దుంపల రంజిత్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోపాలవాడకు చెందిన ఎస్కే రేష్మ(27) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని సీఐ రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొంతకాలంగా రేష్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రేష్మ గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మన్‌ల మధ్య వాగ్వాదం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండల ఎంపీపీ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌ల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. బెల్లంపల్లి మండలంలో రోడ్డు నిర్మాణంలో ఇటీవల కేటాయించిన నిధుల విషయంలో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా మొత్తానికి అధికారం ఉన్న కేవలం బెల్లంపల్లి మండలాన్ని, తనను టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టడం ఎందుకని వైస్ చైర్మన్‌పై ఎంపీపీ మండిపడ్డారని, దీంతో ఇరువురి మధ్య గొడవ జరగడంతో అక్కడి వారు ఇరువురిని సముదాయించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీపీ శ్రీనివాస్‌ను సాక్షి వివరణ కోరగా రోడ్ల నిర్మాణం మంజూరైనా నిధుల విషయంలో ఇద్దరి మధ్య కొంత మాటలు జరిగిన విషయం నిజమేనని తెలిపారు.

క్రీడలపై సింగరేణి శీతకన్ను

- 25 నుంచి కోలిండియా టీటీ పోటీలు
- సింగరేణిలో మొదలు కాని క్రీడాకారుల ఎంపిక
- ఇలాగైతే ప్రాక్టీస్ చేసేదెప్పుడు..?



శ్రీరాంపూర్: బొగ్గు పరిశ్రమల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే కోలిండియా క్రీడా పోటీలు జూలై నుంచి మొదలవుతున్నాయి. ఈ మేరకు పోటీల క్యాలెండర్‌ను కోలిండియా యాజమాన్యం ఇటీవల విడుదల చేసింది. ఇందులో భాగంగా డబ్ల్యూసీఎల్ ఆధ్వర్యంలో నాగ్‌పూర్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు కోలిండియా టేబుల్ టెన్నీస్ (టీటీ) పోటీలు జరుగనున్నాయి. ప్రతీ సంవత్సరం జరిగే కోలిండియా పోటీలకు సింగరేణి నుంచి క్రీడాకారులు పాల్గొని పలు బహుమతులు సాధిస్తారు. ఈసారి కూడా కంపెనీ నుంచి క్రీడాకారులు కోలిండియా పోటీలకు హాజరు కావాలి. జూలై 25 నుంచి టేబుల్ టెన్నీస్ పోటీలు ప్రారంభం కానున్నప్పటికీ సమాచారం లేదని కంపెనీలోని టేబుల్ టెన్నీస్ క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. కారణం ఈ పోటీలకు కేవలం 25రోజుల గడువే మిగిలి ఉన్నప్పటికీ క్రీడాకారుల ఎంపిక చేయలేదు.

ప్రకటించని క్రీడా క్యాలెండర్...

ప్రతీ సంవత్సరం కంపెనీ డిపార్టుమెంటల్ క్రీడాపోటీలను నిర్వహిస్తుంది. డిపార్టుమెంట్ ఆఫ్ వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్, జీఏ) ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. ముందుగా ఏరియా స్థాయిలో, ఆ తరువాత కంపెనీ స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు కంపెనీ ఆయా స్థాయిలో క్రీడా వార్షికోత్సవం పేరుతో బహుమతులు ప్రదానం చేస్తారు. ఏ క్రీడలు ఎప్పుడు, ఎక్కడ నిర్వహించాలో ప్రతీ ఆగస్టు నెలలో క్రీడా క్యాలెండర్‌ను విడుదల చేస్తారు. అయితే ఈసారి కోలిండియా పోటీలు ముందుగానే మొదలు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీ కూడా డిపార్టుమెంటల్ పోటీలు ముందుగా నిర్వహించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

టేబుల్ టెన్నీస్ అయినా.. నిర్వహించాలి

ముందుగా కోలిండియా టేబుల్ టెన్నీస్ పోటీల్లో పాల్గొనాలి. కనీసం ముందస్తుగా కంపెనీలో ఈ పోటీలైనా నిర్వహించాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఏరియా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు, కంపెనీ స్థాయిలో తలపడుతారు. కంపెనీ స్థాయిలో బహుమతుల సాధించిన వారిని కోలిండియా పోటీలకు పంపిస్తారు. ముందుగా ఈ పోటీలు నిర్వహిస్తే కోలిండియా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సెలక్ట్ అవుతారు. సెలక్ట్ అయిన వారికి శిక్షణ తీసుకోవాల్సి ఉంది. తక్షణమే కంపెనీ పరిధిలో ఈ పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేయాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు. టేబుల్ టెన్నీస్‌లో సింగిల్స్, డబుల్స్, వెటరన్ సింగిల్స్, వెటరన్స్ డబుల్స్ ఉంటాయి.

స్పోర్ట్స్ అధికారుల పోస్టుల ఖాళీలు...

సింగరేణి యాజమాన్యం క్రీడలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని క్రీడాకారులు వాపోతున్నారు. దీనికి నిదర్శనం ఏళ్లుగా భర్తీకి నోచుకోకుండా ఖాళీగా ఉన్న క్రీడాకారులు, ఉద్యోగుల పోస్టులే నిదర్శనం. కంపెనీ స్పోర్ట్స్ ఆఫీసర్ రాజకొమురయ్య నాలుగేళ్ల క్రితమే రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటికీ పూర్తిస్థాయి అధికారిని నియమించకుండా ఇతర విభాగం అధికారికి దీనిని ఇన్‌చార్జిగా అప్పగించారు. ఆర్జీ 1 ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ కె.రాజనారాయణరెడ్డి మూడేళ్ల క్రితం, కార్పొరేట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ ఒకరు సంవత్సరం క్రితం రిటైర్డ్ అయ్యారు. మరో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ కూడా ఇటీవలే అనారోగ్యంతో మెడికల్ బోర్డుకు వెళ్లడంతో ఆ సీటు కూడా ప్రస్తుతం ఖాళీగానే ఉంది. వీరి స్థానాలను భర్తీ చేయకుండా ఇన్‌చార్జిలతోనే వెళ్లదీస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో యాజమాన్యం క్రీడలపై నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వృత్తి కోర్సుల శిక్షకులకు ఆహ్వానం

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2023-24కు పలు వృత్తి కోర్సులను నేర్పించడానికి అర్హులైన శిక్షకులు దరఖాస్తులు చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్ వంటి కోర్సులు నేర్పించడం కోసం శిక్షకులు కావాలని, ఆసక్తి గల వారు ఈ నెల 20 లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో టింబర్ యార్డు ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టింబర్ యార్డ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించుటకు కృషి చేస్తున్నామన్నారు. గ్రీవెన్స్ 2లో చేసుకున్న దరఖాస్తులపై కంపెనీ స్పందించి చర్యలు తీసుకుంటుందన్నారు. గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, జీఎంలు అరవిందరావు, చిరంజీవి, యాదయ్య, టింబర్ యార్డ్ ఇన్‌చార్జి జక్కారెడ్డి, డెప్యూటీ పర్సనల్ మేనేజర్‌లు రాజేశ్వరరావు, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య


మాట్లాడుతున్న వీ సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు 11వ వేతన ఒప్పందకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య యజమాన్యంను డిమాండ్ చేశారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ సిహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కంపెనీ గత సంవత్సరం సాధించిన లాభాల నుంచి రూ.700కోట్లను వాటాగా చెల్లిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ నస్పూర్‌లో జరిగిన బహిరంగ సభలో కార్మికులకు హామీ ఇచ్చారని, వెంటనే ఈ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలేజీలు, స్కూల్స్ ప్రారంభమయ్యే ఈ సమయంలో పిల్లల ఫీజుల కోసం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ డబ్బులను త్వరగా చెల్లించాలన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం, సింగరేణి యజమాన్యం భయపడుతుందని వివరించారు. ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామన్న భయం అధికార పార్టీలో ఉందన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యుత్, బొగ్గు కొనుగోళ్లకు సంబంధించి రావాల్సిన రూ.26 వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా కొనసాగితే సింగరేణిని సొమ్మును ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు దోచుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సహాయ కార్యదర్శి గునిగంటి నరసింహారావు, ఫిట్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి చల్ల తిరుపతి, మధు, సురేష్, రమేష్, శేఖర్, మంతెన సతీష్, పాల్గొన్నారు.

టింబర్ యార్డ్ కార్మికులకు అన్యాయం


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్


శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్ లోని టింబర్ యార్డ్‌లో పనిచేసే కార్మికులకు వేతనాల చెల్లింపులో తీవ్ర అన్యాయం జరుగుతుందని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం ఇక్కడ ఆయన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. టింబర్ యార్డ్‌లో పనిచేసే కార్మికులకు ఫీస్ రేటెడ్ కార్మికులుగా 34ఏళ్లుగా పనిచేస్తున్న వారికి ఎలాంటి వేతనాలు పెరగడం లేదన్నారు. వీరికి ఇంకా మొదటి క్యాటగిరీ వేతనాలనే చెల్లిస్తున్నారన్నారు. 4వ వేజ్‌బోర్డ్ నుంచి వారి బెసిక్ పెరగాల్సి ఉండగా ఇప్పటికీ 11వ వేజ్ బోర్డు అమలవుతున్నా... వారు కేటగిరీ వన్ బేసిక్‌ను మాత్రమే పొందుతున్నారన్నారు. దీంతో ప్రతి నెలా ఒక్కో కార్మికుడు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు వేతనాలను నష్టపోతున్నారన్నారు. దీంతో పాటు సీఎంపీఎఫ్, పింఛన్ కూడా పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని తెలిపారు. దీనికి కారణం గుర్తింపు సంఘాలుగా ఉన్న ఏఐటీయూసీ, టీబీజీకేఎస్‌లే అన్నారు. వారు పట్టించుకోకపోవడంతోనే వారికి అన్యాయం జరిగిందని వివరించారు. కార్మికులకు వేతనాలు పెంచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు హెచ్ఎంఎస్ పోరాడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు హెచ్ఎంఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, సెంట్రల్ నాయకులు గోళ్ల సత్తయ్య, కంబాల నరసయ్య, దుర్గం లక్ష్మణ్, ఫిట్ సెక్రెటరీ క్రాంతి కుమార్, రాజేంద్రప్రసాద్, నామాల శ్రీనివాస్, వినయ్ పాల్గొన్నారు.

వేతనాల పెరుగుదల కోసం ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడలో కార్మికులను కలిసి శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు, జీవోలను సవరించకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు చేసిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా 2021, జూన్ 30న జీవో నంబర్ 22 విడుదల అయినప్పటికీ గెజిట్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించని పక్షంలో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, ప్రవీణ్, వెంకటేష్, ఊశన్న, ధర్మారావు, మొండి పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో అదనపు కలెక్టర్ తనిఖీ


బియ్యం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నెన్నెల: మండలంలోని గన్‌పూర్‌లోని శ్రీలక్ష్మీ శ్రీనివాస్ రైస్ మిల్లును గురువారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా ఎలా ఉంటుంది, 24గంటలు పని చేసేలా వర్కర్‌లను ఉంచుకుని 18గంటలు మిల్లింగ్ అయ్యేటట్లు చూడాలని, సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేసి రోజు ఉత్పత్తిని 70 శాతం కంటే ఎక్కువ అందించాలని సూచించారు. దిగుమతి చేసిన ధాన్యాన్ని ఏ విధంగా వాడుతున్నారు, బియ్యం ఏ విధంగా వస్తున్నాయి, గ్రేడింగ్ ఏ విధంగా అవుతుందనే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంట ఉన్న 10 మంది తహసీల్దార్‌లకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు తహసీల్దార్‌లు మిల్లులను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదికలను అందజేయాలని సూచించారు. స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ప్రింటెండ్ బుక్కులను తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఆయన వెంట డీసీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం వేణు, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి ఉన్నారు.

నిరసన దీక్ష జయప్రదం చేయండి

జైపూర్: ఈ నెల 17న గురుకులాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన దీక్షను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ గురుకులాల రాష్ట్ర కన్వీనర్ డి.ఎల్లయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి జి.రాజావేణు కోరారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. జిల్లా కోశాధికారి బి.కిరణ్, కార్యదర్శి వి.కిరణ్‌కుమార్, బారికిరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిఖని గనిపై తేనెటీగల దాడి

- దాడిలో గాయపడిన అధికారులు, కార్మికులు
- ఇద్దరికి తీవ్ర గాయాలు, ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్
- ఏరియా ఆస్పత్రిలో పలువురు క్షతగాత్రులు


కార్మికుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై గురువారం తేనెటీగలు దాడిచేసి గాయపరిచాయి. అనుహ్యంగా చోటుచేసుకున్న ఈ ఘటనతో అధికారులు, కార్మికులు తీవ్రంగా బెంబేలెత్తిపోయారు. పనిచేస్తున్న చోటు వద్ద నుంచి ప్రాణ భీతితో పరుగులు తీశారు. సమయస్ఫూర్తిగా వ్యవహరించి త్రుటిలో ప్రాణాలను కాపాడుకున్నారు. బాధితులు, కార్మికుల కథనం ప్రకారం... శాంతిఖని మ్యాన్ వైండింగ్ షాపు వద్ద హెడ్ గేర్‌కు ఉన్న హైడ్రాలిక్ పుల్లీని ఇటీవల ఏర్పాటు చేశారు. ఆ పుల్లి పనితీరును పరిశీలిస్తుండగా పైన ఉన్న తేనె టీగలు ఒక్కసారిగా లేచాయి. క్షణాల వ్యవధిలో తేనే టీగలు దాడి చేయడంతో అక్కడే పనులను పర్యవేక్షిస్తున్న డీడీఎంఎస్ మెకానికల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గని రక్షణాధికారి రాజు, ఫిట్ ఇంజనీర్ రాంబాబు, ఇంజనీర్ సైదులు, గని వెంటిలేషన్ అధికారి పూర్ణచందర్, మెకానికల్ ఫోర్‌మెన్ అశోక్, ఫిట్టర్ అన్వర్ పాషా, ఎలక్ట్రీషన్ శ్రీనివాస్, జనరల్ మజ్దూర్ కార్మికుడు తిరుపతి, ఎంఎంపీఎల్ అధికారి విశ్వకర్మలు గాయపడ్డారు. తేనెటీగల గుంపు నుంచి కాపాడుకునేందుకు పక్కనే ఉన్న గదుల్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. అప్పటికే ఇరువురిపై తేనెటీగలు విరుచుకుపడ్డాయి. తేనే టీగలు దాడి చేసిన సమాచారాన్ని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డికి ఇతర అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో హుటాహుటిన స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఫిట్ ఇంజనీర్ రాంబాబు, ఇంజనీర్ సైదులు తీవ్రంగా గాయపడటంతో ప్రథమ చికిత్స చేసి మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. మిగతా క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

క్షతగాత్రులకు పరామర్శ...

తేనెటీగల దాడిలో గాయపడిన క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి వెళ్లి పలువురు పరామర్శించారు. అందులో ఎమ్మెల్యే చిన్నయ్య, మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, టీబీజీకేఎస్ శాంతిఖని ఫిట్ సెక్రెటరీ దాసరి శ్రీనివాస్, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, ఏరియా ఆస్పత్రి ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకులు సమ్మయ్య, ఓదెలు, వెంకటస్వామి, ఫిట్ సెక్రెటరీ శివకుమార్, బి.తిరుపతి, ఏఐటీయూసీ నాయకులు నర్సయ్య, తిరుపతి గౌడ్, సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు ఉన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా


పోస్టర్లు విడుదల చేస్తున్న అక్కల తిరుపతివర్మ

శ్రీరాంపూర్: ఈ నెల 15న మంచిర్యాలలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, హైకోర్టు న్యాయవాది అక్కల తిరుపతివర్మ తెలిపారు. గురువారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 70 కంపెనీల హెచ్‌ఆర్‌లు హాజరవుతారని, 4000 మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఈ మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. మేళా సహాయకులు శ్రీనివాస్, మహేశ్‌వర్మ, కే.తిరుపతి, బియ్యాల సత్తయ్య, నరేందర్, సింగతి నరేందర్, అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష

మంచిర్యాలటౌన్: డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు) నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని మంచిర్యాల మున్సిపల్ ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. పాలకవర్గాన్ని ప్రశ్నిస్తున్న వారి వార్డుల్లో కేటాయించక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రతియేటా కేటాయిస్తున్న డీఎంఎఫ్‌టీ నిధులను అవసరాన్ని బట్టి మంచిర్యాల మున్సిపాలిటీకి దాదాపుగా రూ.30 కోట్లు కేటాయించారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన 2, 3, 17, 23, 24 వార్డులకు కేటాయించలేదు. అధికార పార్టీ కౌన్సిలర్లకు, ప్రతిపక్షంలో ఉండి ప్రశ్నించని వారిలో కొందరికి మాత్రమే నిధులను కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి.

చోరీకి గురైన కారు లభ్యం

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలోని అపోలో మెడికల్ షాపు వద్ద ఈ నెల 12న చోరీకి గురైన కారు గురువారం లభించిందని సీఐ రాజు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మెడికల్ దుకాణం వద్ద కారు నిలిపి ఉంచగా చోరీకి గురైంది. గురువారం సాయంత్రం జైపూర్ సమీపంలోని రహదారి పక్కన లభ్యమైందని పేర్కొన్నారు. సీసీ పుటేజీ ఆధారంగా దొంగను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఏఈవోల సమస్యలు తీర్చాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వీఆర్ఏలను వ్యవసాయశాఖకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఏఈవోలు గురువారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పనకు వినతిపత్రం అందజేశారు. శేఖర్, రాజ్‌కుమార్, వైష్ణవి, రాజశేఖర్, సాగర్, సాయిక్రిష్ణ, శివరంజని, దివ్య, చందన, సుధరాణి, ప్రణిత ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలకు చేరుకున్న విద్యార్థి

- ఉదయం హాస్టల్ నుంచి తప్పించుకొని జిల్లా కేంద్రానికి..
- సిబ్బంది నిర్లక్ష్యంతో పాఠశాల నుంచి బయటకు వెళ్లిన బాలుడు


ఉపాధ్యాయులకు బాలుడిని అప్పగిస్తున్న శేఖర్

తాంసి: గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పాఠశాల నుంచి ఉదయం తప్పించుకుని బయటకు వచ్చి స్వగ్రామం వెళ్దామనుకున్న విద్యార్థి ఎట్టకేలకు గంటల వ్యవధిలోనే తిరిగి వసతి గృహం చేరాడు. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో గాదిగూడ మండలంలోని పర్సవాడ గ్రామానికి చెందిన మడావి జ్ఞానేశ్వర్ మూడో తరగతి చదువుతున్నాడు. జ్ఞానేశ్వర్ ఇంటికి వెళ్లాలనుకుని గురువారం ఉదయం వేకువజామున ఆశ్రమ పాఠశాల సిబ్బందిని తప్పించుకుని బయటకు వచ్చాడు. తాంసి నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే క్రమంలో వడ్డాడి ఎక్స్‌రోడ్డు వరకు నడుచుకుంటూ వచ్చాడు. పాలు తీసుకువెళ్లే వ్యక్తి జిల్లా కేంద్రానికి వెళ్లే క్రమంలో ఒంటరిగా ఉన్న బాలుడిని గమనించి తన బైక్‌పై జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి పాల వ్యాపారి శేఖర్‌కు బాలుడిని అప్పగించాడు. బాలుడి ద్వారా వివరాలు తెలుసుకున్న శేఖర్ సోషల్ మీడియాలో ఫొటోను పంపించాడు. దీంతో విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది జిల్లా కేంద్రానికి చేరుకుని విద్యార్థిని తీసుకుని పాఠశాలకు వెళ్లారు. విద్యార్థి తల్లితండ్రులకు సైతం సమాచారం అందించారు. ఉదయం పూట పాఠశాల విడిచి వెళ్లిన గంటల వ్యవధిలోనే పాఠశాలకు చేరుకోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. బయటకు వెళ్లిన విద్యార్థి తప్పిపోతే ఎలా అని స్థానికులు పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

జెడ్పీలో జీపీఎఫ్ విభాగం ప్రారంభం


కార్యాలయం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం జీపీఎఫ్ (సాధారణ భవిష్య నిధి) విభాగాన్ని నుజెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి జెడ్పీ కార్యాలయాన్ని విభజించగా జీపీఎఫ్ విభాగం ఇన్నాళ్లు ఉమ్మడి జిల్లాలోనే నిర్వహించారు. దీంతో జిల్లాలోని జెడ్పీ ఉద్యోగులకు జీపీఎఫ్‌కు సంబంధించిన వాటిని జిల్లాల వారీగా విభజించగా అందుకు సంబంధించిన విభాగాన్ని జెడ్పీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అబ్దుల్ సమద్, జెడ్పీ సీఈవో కె.నరేందర్, డెప్యూటీ సీఈవో ఆర్.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం కేటాయించాలి


కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన హిందూ సంఘాల నాయకులతో కలిసి సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టరేట్ ఏవో సురేశ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని రెండు సంవత్సరాలుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదన్నారు. కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం అయిన ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు కాలాయాపన చేయకుండా అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు కర్ణకంటి రవి, మునిమంద రమేశ్, సత్రం రమేశ్, ఈర్ల సదానందం, ముదాం మల్లేశ్ పాల్గొన్నారు.